ఆరోజు చేయాల్సిన అర్జెంటు పని అంతా పూర్తి అయింది. కంప్యూటర్ స్విచ్ ఆఫ్ చేసి, టైమెంతయ్యిందా? అని తలెత్తి చూస్తే ఆరున్నర దాటుతోంది. నేను కూడా డెస్క్ మీద ఉన్న వన్నీ సర్ది, ఇంటికి బయలుదేరాను. బి.పి. మాత్రలు అయిపో యిన విషయం గుర్తొచ్చి బండి ఆపి, మెడికల్ షాపులోకి వెళ్లి నాక్కావాల్సిన మాత్రల పేర్లు చెప్పి చుట్టూ కలయజూసాను.

నా ప్రక్కనున్నతను బిల్ పే చేసి చిల్లరకోసం ఎదురుచూస్తున్నాడు. ఎక్కడో చూసిన మొహం!

"మీరు..నువ్వు శేషువేనా?" అని అడిగాను.

వెంటనే అతను ప్రక్కకి తిరిగి చూసి, "అరె! రామూ! ఎన్నాళ్ళయిందిరా నిన్ను చూసి? ఎలా ఉన్నావు? ఎంతమంది పిల్లలు? ఎక్కడ ఉంటున్నావు" అని ప్రశ్నల పరంపర గుప్పించాడు.

"ఆగరా బాబూ! నన్ను కాస్త ఊపిరి తిప్పుకోనియ్యి. ఇది నిజమా! కలా! అర్థం కావటం లేదు" అంటూ, "నాకిద్దరు పిల్లలు, పెద్దాడు విప్రోలో పనిచేస్తు న్నాడు. రెండవ వాడు ఇంటర్ చదువుతున్నాడు. నీ సంగతేంటి?" అని అడి గాను.

"నాకు ఇద్దరు ఆడపిల్లలురా! పెద్దమ్మాయికి పెళ్ళి చేసాను. రెండవ అమ్మాయి చదువుకుంటోంది" అని చెప్పి వాడు తన ఇంటి అడ్రసు ఇచ్చి తప్పకుండా రమ్మని మరీ మరీ చెప్పాడు శేషాద్రి.

★★★

ఆరోజు ఆదివారం. కొంచెం ఆలస్యంగా నిద్ర లేచాడు రామారావు. ఈరోజు ఎలాగైనా శేషు ఇంటికి వెళ్ళాలి. ఆరవ తరగతి నుండి డిగ్రీ అయ్యేవ రకు కలిసి చదువుకున్నాము. తర్వాత ఎవరి ఉద్యోగాలు వాళ్ళవి అవడం వల్ల దూరం అయిపోయాము. అందులోనూ నాది తరచుగా బదిలీలయ్యే



ఉద్యోగం. మొదట్లో ఒకరి అడ్రసు మరొకరికి తెలియచేసుకుని ఉత్తర ప్రత్యుత్తరాలు సాగించేవాళ్ళం. తరువాత ఎవరి బిజీ వాళ్ళదైంది.

వాడి ఇల్లు కనుక్కోవడం ఎక్కువ కష్టమేమీ కాలేదు. చిన్న డాబా ఇల్లు. బాల్కనీలో కూర్చుని పేపరు చదువుతున్నాడు.

నన్ను చూడగానే, ఆప్యాయంగా "రా!రా" అని భుజం మీద చెయ్యి వేసి లోనికి తీసుకెళ్ళాడు. వాళ్ళ శ్రీమతికి పరిచయం చేసాడు.

"బావున్నారా అన్నయ్యా!" కాఫీ ఫలహారాలతో వచ్చి పలకరించిన ఆవిడ వంక ప్రశ్నార్థకంగా చూసాను.


"ప్రమీలరా! నువ్వు మర్చిపోయినట్లున్నావు. మా చెల్లెలు. మనం డిగ్రీ చదివినప్పుడు తను టెంత్ చదివేది" అని శేషు గుర్తు చేసాడు. మరికాసేపు అవీ ఇవీ మాట్లాడుకున్నాక ఇంక నేను వెళ్ళడానికన్నట్లు లేచాను.

వాడూ నాతో గేటు వరకూ వచ్చాడు. అక్కడ కాసేపు ఆగాము.అప్పుడు చెప్పాడు తన చెల్లి గురించి.



## మరింత అందంగా సంగీత!

చూడ్డానికి అందంగా ఉన్నా ఎందుకోగానీ సంగీతకు సరైన ఆఫర్లు రావడం లేదనుకోవచ్చు. ఇటీవల ఆమె నటించిన తమిళ సినిమా 'ధనం'లో గ్లామరస్‌గా దర్శనమిచ్చిన సంగీత ఇదే సమయంలో తన గ్లామర్‌ని మరింత పెంచుకునే ప్రయత్నాల్లో వుందని ఆమె సన్నిహితులు అంటున్నారు. బరువు తగ్గించుకుని మరింత స్లిమ్‌గా మారడమే కాకుండా, స్కిన్ ట్రీట్‌మెంటు కూడా తీసుకుని మరింత ఆకర్షణీయంగా తెరపై కనబడాలనీ, తద్వారా తన కెరీర్‌ని బిజీ చేసుకోవాలనే ఆలోచనల్లో ఉందిట... సో సంగీతా... ఆల్ ది బెస్ట్!




"ఇంకా పెళ్ళి కాలేదురా! వయసులో ఉన్నప్పుడు నేను వెతికి తెచ్చిన పెళ్ళి కొడుకులకు అందం లేదనో, చదువు హోదాలు లేవనో వంకలు పెట్టింది. ఏమైనా చెల్లి పెళ్ళి చెయ్యలేని అసమర్థుడినయ్యాను. ఇప్పుడేమో నలభై అయిదేళ్ళు దాటాయి. అందుకే మా పెద్దమ్మాయికి ఇరవై రాగానే మధ్యతరగతి వాళ్ళే అయినా మంచి అబ్బాయిని చూసి పెళ్ళి చేసేసాను" అని సిగ్గుతో తలవంచుకున్నాడు.

"బాధపడకురా! నువ్వేం చేస్తావు? ఆవిడ తల రాత అలా వుంటే" అని నేను బైక్ స్టార్ట్ చేసాను.

తర్వాత ఇద్దరి మధ్యా రాకపోకలు మళ్ళీ మొదలయ్యాయి. మళ్ళీసారి వాళ్ళింటికి వెళ్ళిన దగ్గర నుండి ప్రమీలను గమనించడం మొదలు పెట్టాను.

చాలా వినయంగా ఉంటుంది. ఎప్పుడూ ఏదో ఒక పని చేస్తూనే ఉంటుంది. పెద్ద చదువు లేకపోవడం వల్ల, చిన్నప్పుడు తల్లిదండ్రుల గారాబం వల్ల తన జీవితం నాశనం అయింది అని ఆవిడ మీద జాలి పెరగసాగింది. అంతలో, అనుకోని సంఘటన విన్నాను. మా కొలీగ్ భార్య చనిపోయింది. జబ్బు చేసి. ఒక్కడే కొడుకు. టెంత్ చదువుతున్నాడు. ఆవిడ పోయిన కొత్తలో ఎవరో ఒకరు దగ్గిర బంధువులు వచ్చి వండిపెట్టేవారు, సహాయపడేవారు. తర్వాత ఎవరు వస్తారు? ఇబ్బంది పడుతూ ఉన్నాడు పాపం!

నాకు తళుక్కున ఒక ఆలోచన మెరిసింది. ప్రమీలని అతనికిచ్చి చేస్తే? మెల్లిగా అతన్ని కదిలించి చూసా. మొదట్లో అభ్యంతరపెట్టినా, తన కొడుకు చదువు, భవిష్యత్తు ఆలోచించి సరేనన్నాడు. ఇంక శేషుని ఒప్పించడం! చెల్లికి పెళ్ళి చేయలేకపోయానని చాలా బాధపడుతున్నాడు కదా! ప్రయత్నం చేద్దామని వాళ్ళింటికి బయలుదేరాను.

"నీతో మాట్లాడాలి ఒకసారి పైకి రా!" అని మేడ మీదకి తీసుకెళ్ళాను. సంగతంతా చెప్పి, "ఈ వయసులో ప్రమీలకు పెళ్ళి అవటం కష్టం. ఇతను చాలా మంచివాడు. నెమ్మదస్తుడు. ప్రమీలను ఒప్పించరా!" అని చెప్పాను.

"ఇప్పుడు నేనీ విషయం కదిపితే తను హర్ట్ అయితే? రెండోపెళ్ళి వాడిని తెస్తావా అన్నయ్యా? అంటే నేను తట్టుకోలేను. తను బాధపడితే నేనూ మా ఆవిడా అసలు చూడలేము. తను మాకు బరువు కాదు లేరా" అన్నాడు.

"సరే! నువ్వు కాదులే, నేనే మాట్లాడతాను. ఒకసారి పిలువు" అని చెప్పా.

వాడు క్రిందికి వెళ్ళి ఆమెను డాబా పైకి పంపాడు. ఎలా మొదలుపెట్టాలా అని తర్జన భర్జన పడి "ప్రమీలా! నేను కూడా మీ అన్నయ్యలాంటి వాడినే. నీ మంచికోరి చిన్న సలహా ఇస్తాను. ఏమీ అనుకోకు" అని విషయం మొత్తం చెప్పి "అతను చాలా మంచివాడమ్మా! నువ్వు ఆ పిల్లవాడికి తల్లిలేని లోటు తీర్చి ఆ కుటుంబాన్ని ఆదుకున్న దానివి అవుతావు. ఒకవేళ నిన్ను నొప్పిస్తే నన్ను మన్నించమ్మా!" అని ఆమె వైపు చూసాను.

నా గొంతులోని ఆర్ద్రతకో ఏమో ఆమె తలెత్తి చూసింది. కళ్ళనిండా నీళ్ళు!

"ఒకప్పుడు అందరికీ వంకలు పెట్టిన మాట నిజం. పల్లెటూర్లో అమ్మానాన్నల దగ్గర గారాబంగా పెరిగాను. అమ్మేమో, నీ అందం చూసి రాకుమారుడిలాంటి వాడు వచ్చి నిన్ను పెళ్ళి చేసుకుంటాడని నూరిపోసేది. కలల్లోంచి వాస్తవానికి వచ్చేటప్పటికి నడివయసుకి వచ్చాను. ఇప్పుడు నాకూ అనిపిస్తోంది. నాకూ ఒక ఆలంబన కావాలి. ఎవరికీ భారం కాకూడదని. అన్నయ్యకి చెప్పాలంటే సిగ్గుగా ఉంది. నాకూ తెలుసు. అన్నయ్య నా గురించి చాలా బాధపడుతున్నాడని" చేతుల్లో ముఖం పెట్టుకుని భోరుమని ఏడిచింది.

"ఊరుకోమ్మా. అయితే నీకీ సంబంధం ఇష్టమే అన్న విషయం శేషుగాడితో చెప్పాలి. చాలా సంతోషిస్తాడు" అని పరిగెడుతూ మేడ దిగాను.

మరొక వారం రోజుల వ్యవధిలో ప్రమీల పెళ్ళి నిరాడంబరంగా జరిగింది. అన్నా చెల్లెళ్ళ మధ్య ఏర్పడిన తెర తొలగించినందుకూ, ఆప్తమిత్రుడి వెత తీర్చినందుకూ నాకు చాలా ఆనందంగా ఉంది.

★